PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 320 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 13 నవంబర్ 2026

అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల అండ



3లో

విలీనం పేరుతో విద్యకు దూరం చేయొద్దు



3లో

ఆసియాన్ సదస్సుకు
మోడీ పర్యటన

- నవంబర్ 16 నుంచి 18 వరకు ఫిలిప్పీన్స్‌లో పర్యటన.. 23వ భారత్-ఆసియాన్ సదస్సు, 21వ తూర్పు ఆసియా సమావేశంలో పాల్గొననున్న ప్రధాని



న్యూఢిల్లీ,నవంబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్): ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 16 నుంచి 18 వరకు ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో పర్యటించనున్నారు. 23వ ఆసియాన్-భారత్ సదస్సు, 21వ తూర్పు ఆసియా సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు విదేశాంగ శాఖ తూర్పు విభాగం

మిగతా2లో...

పెట్టుబడిదారుల రక్షణకు
ప్రత్యేక చట్టం

- త్వరలో అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో బిల్లు ప్రవేశపెడతాం: చంద్రబాబు



2లో

జూన్ 2 నాటికి టిమ్స్
ఆస్పత్రులు సిద్ధం!

ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం డిసెంబర్‌లోగా పూర్తి చేయాలి

● వైద్యులు, సిబ్బంది నియామకాలకు ప్రత్యేక కార్యాచరణ.. ఆస్పత్రుల మధ్య సమన్వయంతో మెరుగైన వైద్య సేవలు ● అదనపు నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం.. అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు





హైదరాబాద్,నవంబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్ర ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్మిస్తున్న తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రుల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నాటికి మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. అదే సమయంలో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణాన్ని డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు.

మిగతా2లో...

హైదరాబాద్‌లో
న్యూట్రిఫ్రెష్ విస్తరణ

- రూ.225 కోట్ల పెట్టుబడితో 150 ఎకరాల్లో ఆధునిక వ్యవసాయ క్షేత్రాలు

2లో

nutrifresh
Cultivating A Greener Tomorrow

డీఎస్సీ నియామకాల్లో నకిలీ
ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రాలు!

1,500 మంది అనర్హులకు ఉద్యోగాలంటూ పిటిషన్.. పోలీసులకు హైకోర్టు ఆదేశం



అమరావతి,నవంబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్): డీఎస్సీ2025 నియామకాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కోటా కింద నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి పలువు రు ఉద్యోగాలు పొందారన్న ఆరోపణలపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారానికి

మిగతా2లో...

2035 నాటికి సంతోషకర
రాష్ట్రంగా ఏపీ

- యువతకు ఉద్యోగాలతోపాటు ఆరోగ్యం, ఆనందం, ఆత్మవిశ్వాసం కల్పించడమే లక్ష్యం: నారా లోకేష్ - మహిళల ఆరోగ్యం, ఉపాధి, ఆర్థిక స్వావలంబనపై ఉపాసన కొణిదెలతో చర్చ



విశాఖపట్నం,నవంబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్): 2035 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆరోగ్యవంతమైన, సంపన్నమైన, సంతోషకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు వారు ఆరోగ్యంగా, సంతోషంగా, ఆత్మవిశ్వాసంతో జీవించే పరిస్థితులు కల్పించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు.విశాఖపట్నంలో జరుగుతున్న

మిగతా2లో...

భారీగా ఐపీఎస్‌ల
బదిలీలు

● 21 మంది ఐపీఎస్ అధికారులకు స్థానచలనం.. హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్ ● సజ్జనార్‌కు ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్ బాధ్యతలు.. మహిళా భద్రత విభాగం డీజీపీగా సౌమ్య మిశ్రా




2లో

ఏపీలో 23 పట్టణ స్థానిక సంస్థలకు
ఎన్నికల నోటిఫికేషన్ జారీ

● 26న పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు

● మొదటి దశ పంచాయతీ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్

● రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా



అమరావతి,నవంబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిన 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఆయా పట్టణ ప్రాంతాల్లో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఈ నెల 26న పోలింగ్, 27న అవసరమైతే రీపోలింగ్, 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన చేపట్టనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు.ఎన్నికలు జరగనున్న వాటిలో శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరితాడేపల్లి కార్పొరేషన్లు ఉన్నాయి. అలాగే ఆమదాలవలస, రాజాం, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం,

మిగతా2లో...

జూన్ 2 నాటికి టిమ్స్ ఆస్పత్రులు సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణ పనుల్లో జాప్యానికి తావులేకుండా నిర్దేశిత గడువులోగా అన్ని పనులు పూర్తి చేయాలని సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వైద్యారోగ్య శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం పలు కీలక నిర్ణయాలు, సూచనలు చేశారు. ఆస్పత్రుల నిర్మాణంతోపాటు వాటి నిర్వహణ, వైద్యులు, సిబ్బంది నియామకాలు, రోగులకు అందించే సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. భవనాలు సిద్ధమైన తర్వాత వైద్య సదుపాయాల కొరత లేకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించు కోవాలని ఆదేశించారు.**వైద్యుల నియామకాలకు ఒకే విధానం** మూడు టిమ్స్ ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలకు ఒకే విధమైన విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆస్పత్రుల అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని ఒకచోట నుంచి మరోచోటికి బదిలీ చేసుకునే వెసులుబాటు ఉండాలని తెలిపారు. సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యుల నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకు అవసరమైన వైద్యులను బయటి నుంచి నియమించుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రుల ప్రారంభానికి ముందే అవసరమైన వైద్యులు, నర్సింగ్, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. **నిమ్స్‌టిమ్స్ మధ్య సమన్వయం** నిమ్స్ ఆస్పత్రిలో పడకలు అందుబాటులో లేని పరిస్థితుల్లో రోగులను సనత్‌నగర్ టిమ్స్‌కు తరలించేలా రెండు ఆస్పత్రుల మధ్య సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల రద్దీని తగ్గించడంతోపాటు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

నిధుల కొరత లేకుండా చర్యలుటిమ్స్ ఆస్పత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలల అభివృద్ధికి అవసరమైన అదనపు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నిర్మాణాలు, వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోకూడదని తెలిపారు. ఆస్పత్రుల నిర్వహణ బాధ్యతలను సమర్థంగా చేపట్టాలని, పారిశుధ్య నిర్వహణను పూర్తిగా ఔట్‌సోర్సింగ్ విధానంలో చేపట్టాలని సూచించారు.

హాజరుపై సాంకేతిక నిఘా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని సీఎం ఆదేశించారు. సిబ్బంది హాజరు నమోదుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. రోగులకు పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన వైద్య సేవలు అందేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. నిర్ణయించిన గడువుల్లో నిర్మాణాలు పూర్తి చేయడంతోపాటు ఆస్పత్రులు పూర్తిస్థాయిలో పనిచేసేలా అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో న్యూట్రిఫ్రెష్ విస్తరణ

హైదరాబాద్,నవంబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్): బెంగళూరు, చెన్నై నగరాల్లో 2028 మార్చి నాటికి సుమారు 150 ఎకరాల్లో వాతావరణ నియంత్రిత వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు కోసం రైతు భాగస్వాముల పెట్టుబడులతో కలిపి రూ.200 నుంచి రూ.225 కోట్ల వరకు వెచ్చించనుంది.ఈ పెట్టుబడుల్లో కంపెనీ సొంతంగా రూ.75 కోట్ల వరకు సమకూర్చుకో నుండగా, మిగిలిన మొత్తాన్ని రైతు భాగస్వాముల ద్వారా సేకరించనుంది. ప్రస్తుతం బెంగళూరులో 25 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్న సంస్థ.. హైదరాబా ద్‌లోనూ కార్యకలాపాలను విస్తరిస్తోంది. 2027 మార్చి నాటికి హైదరాబాద్‌లో మరో 25 ఎకరాల్లో సాగు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అనంతరం 2028 మార్చి నాటికి మూడు నగరాల్లో కలిపి 150 ఎకరాలకు విస్తరించనుంది. **ఆధునిక సాగుకు ప్రాధాన్యం**ఈ ప్రాజెక్టులో భాగంగా మొక్కల పెంపకానికి ప్రత్యేక నర్సరీలు, పంట కోత అనంతరం ఉత్పత్తుల శుద్ధి, నాణ్యత విభజన, ప్యాకింగ్ కోసం ఆధునిక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. పాలీహౌస్ హైడ్రోపోనిక్స్, నియంత్రిత వాతావరణంలో మట్టి ఆధారిత సాగు విధానాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. దీనివల్ల వాతావరణ మార్పుల ప్రభావం తగ్గడంతోపాటు ఏడాది పొడవునా నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలను పండించే అవకాశం ఉంటుంది.

రైతులకు, యువతకు ఉపాధి

న్యూట్రిఫ్రెష్ ప్రస్తుతం 100కు పైగా రకాల తాజా కూరగాయలు, ఆకుకూరలను స్విగ్గీ, జెప్టో, బిగ్‌బాస్కెట్, రిలయన్స్ ఫ్రెష్ వంటి సంస్థలకు సరఫరా చేస్తోంది. ప్రస్తుతం కంపెనీలో 833 మంది పనిచేస్తుండగా, వారిలో 65 శాతం మంది మహిళలే. విస్తరణతో వ్యవసాయం, రవాణా, నిల్వ, పంపిణీ రంగాల్లో మరిన్ని ఉపాధి అవ కాశాలు ఏర్పడనున్నాయి. దక్షిణ భారతదేశంలో రైతుల భాగస్వామ్యంతో ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్స హించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా సంస్థ పేర్కొంది.

2035 నాటికి సంతోషకర రాష్ట్రంగా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా 'యంగ్ ఆంధ్ర.. థ్రైవింగ్ ఆంధ్ర' పేరుతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో లోకేష్ పాల్గొన్నారు. అపోలో హాస్పిటల్స్ వైస్ చైర్మన్, యూఆర్ లైఫ్ వ్యవస్థాపకురాలు ఉపాసన కొణిదెల ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. విద్య, ఉపాధి, మహిళా సాధికారత, కుటుంబ విలువలు, ఆరోగ్యం, సాంకేతికత, పారిశ్రామికాభివృద్ధి తదితర అంశాలపై ఆమె అడిగిన ప్రశ్నలకు లోకేష్ సమాధానాలిచ్చారు. రాష్ట్రం గతంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ తిరిగి అభివృద్ధి పథంలో పయనిస్తోందని లోకేష్ చెప్పారు. ఆరోగ్య సమస్యలు వచ్చిన తర్వాత వైద్యులను సంప్రదించడం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడంపై యువతలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి నియంత్రించుకోవాలని సూచించారు.ప్రపంచవ్యాప్తంగా సుమారు 58 లక్షల మంది నర్సుల అవసరం ఉందని ఉపాసన పేర్కొనగా, వైద్యారోగ్య రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతకు శిక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని లోకేష్ తెలిపారు. మహిళల్లో రక్తహీనత, ప్రసవానంతర సంరక్షణ, పిల్లల పెంపకం కారణంగా ఉద్యోగాలు వదిలేస్తున్న మహిళలను తిరిగి ఉపాధిలోకి తీసుకురావడం వంటి అంశాలపైనా చర్చించారు. పరిశ్రమలు, కార్యాలయాల్లో పిల్లల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తే మహిళలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు.కుటుంబానికి సమయం కేటాయించడం తనకు అన్నింటికంటే కష్టమని లోకేష్ సరదాగా వ్యాఖ్యానించారు. వీలైనప్పుడల్లా కుటుంబంతో గడిపేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు.

భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

21 మంది ఐపీఎస్ అధికారులకు స్థానచలనం..

హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్

సజ్జనార్‌కు ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్ బాధ్యతలు..

మహిళా భద్రత విభాగం డీజీపీగా సౌమ్య మిశ్రా



హైదరాబాద్,నవంబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ శాఖలో ప్రభుత్వం భారీ మార్పులు చేపట్టింది. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 21 మంది ఐపీఎస్ అధికారులకు స్థానచలనం కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కీలకమైన హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా మహేశ్ మురళీధర్ భగవత్‌ను నియమించింది. ఇప్పటివరకు సీపీగా పనిచేసిన వీసీ సజ్జనార్‌ను తెలంగాణ అగ్నిమాపక, విపత్తుల స్పందన, అత్యవసర సేవలు, పౌర రక్షణ విభాగం డీజీగా బదిలీ చేసింది. ఆయనకు ప్రత్యేక రక్షణ దళం (ఎస్పీఎఫ్) డీజీగా అదనపు బాధ్యతలు కూడా అప్పగించింది.జైళ్లు, దిద్దుబాటు సేవల డీజీపీగా ఉన్న డాక్టర్ సౌమ్య మిశ్రాను మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల డీజీపీగా నియమించింది. పోలీస్ ఆర్గనైజేషన్, లీగల్ విభాగాల అదనపు బాధ్యతలు కూడా ఆమెకు కేటాయించింది. స్వాతి లక్రాకు జైళ్ల శాఖ డీజీపీ బాధ్యతలు అప్పగించడంతోపాటు హోంగార్డ్స్ విభాగం అదనపు బాధ్యతలు ఇచ్చింది. చారు సిన్హాను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీపీగా నియమిస్తూ, సీఐడీ బాధ్యతలను అదనంగా కొనసాగించింది.రవాణా రంగంలోనూ కీలక మార్పులు చేసింది. డాక్టర్ అనిల్‌కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది. ఇప్పటివరకు ఆర్టీసీ ఎండీగా ఉన్న వై. నాగిరెడ్డిని పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా బదిలీ చేసింది. విక్రమ్ సింగ్ మాన్‌కు గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల ఆపరేషన్స్ డీజీపీ బాధ్యతలు అప్పగించింది. అకున్ సబర్వాల్‌ను శాంతిభద్రతల అదనపు డీజీపీగా నియమించింది. ఎం. స్టీఫెన్ రవీంద్రకు తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో డైరెక్టర్ బాధ్యతలు కేటాయించింది.ఇక కార్తికేయను మల్టీజోన్-1 ఐజీగా, కే. రమేష్ నాయుడును రైల్వేస్ ఐజీగా, నారాయణ నాయక్‌ను మల్టీజోన్-2 డీఐజీగా నియమించింది. జి. చందన దీప్తికి జోన్-7 (జోగులాంబ) డీఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఎస్. చంద్రశేఖర్‌రెడ్డిని ఏసీబీ డైరెక్టర్‌గా నియమించింది. పోలీస్ శాఖతోపాటు నిఘా, రైల్వేలు, ట్రాఫిక్, శిక్షణ, పౌరసరఫరాల వంటి కీలక విభాగాల్లో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జారీ చేసిన జీవో నంబర్ 1654 ద్వారా ఈ బదిలీలు అమల్లోకి వచ్చాయి.

ఆసియాన్ సదస్సుకు మోడీ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి రుద్రేంద్ర టాండన్ వివరాలు వెల్లడించారు.మూడు రోజుల పర్యటనలో భాగంగా ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ ఆతిథ్యమిచ్చే విందులో మోడీ పాల్గొంటారు. అనంతరం ఆసియాన్-భారత్ సదస్సు, తూర్పు ఆసియా సదస్సు సమావేశాలకు హాజరవుతారు. పర్యటన సందర్భంగా వివిధ దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది. ఆసియాన్ కూటమిలో 11 దేశాలు సభ్యులుగా ఉన్నాయి.

ఈ ప్రాంతంతో భారత్‌కు ప్రస్తుతం సుమారు 122 బిలియన్ డాలర్ల వాణిజ్య సంబంధాలున్నాయి. ఆగ్నేయాసియా దేశాలతో వ్యూహాత్మ క భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడం, ప్రాంతీయ శాంతి, భద్రత, ఆర్థిక సహకారాన్ని పెంపొందించుకోవడంలో ఈ పర్యటన కీలకంగా మారనుంది. భారత్ అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్' విధానంలో ఆసియాన్ దేశాలతో సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని విదేశాంగ శాఖ వెల్లడించింది.

పెట్టుబడిదారుల రక్షణకు ప్రత్యేక చట్టం

విశాఖపట్నం,నవంబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):రాష్ట్రంలో పెట్టుబడిదారులకు భరోసా కల్పించేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభ కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. దీనికి సంబంధించిన ప్రాథమిక ప్రతిపాదన (కాన్సెప్ట్ నోట్) ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిపారు.పెట్టుబడిదారుల అభిప్రాయాలు సేకరించిన అనంతరం త్వరలో జరగనున్న అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెడతామని చంద్రబాబు చెప్పారు. రాష్ట్ర శాసనసభ ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని, దీనిని జాతీయ స్థాయి చట్టంగా రూపొందించి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌ను కోరారు.ప్రభుత్వాలు మారినప్పుడల్లా పరిశ్రమలకు కేటాయించిన భూములు, స్థలాలు, మంజూరు చేసిన రాయితీలు, అనుమతులను ఏకపక్షంగా మార్చుకుండా నిరోధించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని ముఖ్యమంత్రి వివరించారు. పెట్టుబడిదారులకు స్థిరమైన విధానాలు, భరోసా కల్పించడం ద్వారా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు ఆకర్షించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

ఏపీలో 23 పట్టణ స్థానిక సంస్థలకు

ఎన్నికల నోటిఫికేషన్ జారీ

(మొదటి పేజీ తరువాయి)

తణుకు, చింతలపూడి, గుడివాడ, తాడిగడప, పొన్నూరు, నరసరావుపేట, బాపట్ల, కందుకూరు, పొదిలి, కావలి, గూడూరు, అల్లూరు, శ్రీకాళహస్తి, బి.కొత్తకోట మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.ఈ నెల 14న ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేయనుండగా, 16వ తేదీ నామినేషన్ల దాఖలుకు చివరి గడువుగా నిర్ణయించారు. 17న నామినేషన్ల పరిశీలన, 19న ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం తుది అభ్యర్థుల జాబితా ప్రకటించనున్నారు. మేయర్లు, ఛైర్‌పర్సన్ల ఎంపికకు డిసెంబర్ 5, 6 తేదీల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించనున్నారు.ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల కమిషనర్ ఆదేశించారు. నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వీడియో రికార్డింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు స్పష్టం చేశారు.

డీఎస్సీ నియామకాల్లో నకిలీ ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రాలు!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని పోలీసులను ఆదేశించింది.ఈడబ్ల్యూఎస్ కోటాలో సుమారు 1,500 మంది అనర్హ అభ్యర్థులు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆరోపిస్తూ కర్నూలు, నంద్యాల, కడప జిల్లాలకు చెందిన పలువురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని పిటిషన్‌లో కోరారు.కర్నూలుకు చెందిన ప్రతాపరెడ్డి మరో ఎనిమిది మందితో కలిసి ఈ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు.

మురసు తుపాను నష్టాలపై కేంద్ర బృందం పరిశీలన

- నేడు బాపట్ల, ఏలూరులో పర్యటన.. రేపు పల్నాడు, తూర్పుగోదావరిలో పర్యటన



అమరావతి, నవంబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):మురసు తుపాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు ఏడుగురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం శుక్ర, శనివారాల్లో ప్రభావిత జిల్లాల్లో పర్యటించనుంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ చిత్తరంజన్ దాస్ నేతృత్వంలో ఈ బృందం పర్యటన సాగనుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.కేంద్ర బృందం రెండు గ్రూపులుగా విడిపోయి శుక్రవారం బాపట్ల, ఏలూరు జిల్లాల్లో పర్యటించనుంది. శనివారం మొదటి బృందం పల్నాడు జిల్లాలో, రెండో బృందం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించి తుపాను వల్ల జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించనుంది. బాధితులతో మాట్లాడి నష్టానికి సంబంధించిన వివరాలను సేకరించనుంది.వ్యవసాయం, జలవనరులు, ఆర్థికం, రహదారులు, గ్రామీణాభివృద్ధి, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు, ఇస్రో శాస్త్రవేత్త ఈ బృందంలో ఉన్నారు. అర్నబ్ తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు గతంలో నియమించిన బృందాన్నే మురసు తుపాను నష్టాల పరిశీలనకు కేంద్రం పంపించింది. పర్యటన అనంతరం ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కేంద్ర బృందం సమావేశమై తమ పరిశీలన వివరాలను వెల్లడించే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు.

బెస్ట్ సివిల్ ఇంజనీర్ జాతీయ అవార్డుకు దోమలపల్లి వాసి గాదే బుచ్చయ్య ఎంపిక

● నల్లగొండ జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయికి చాటిన ఇంజనీర్ ● నవంబర్ 15న న్యూఢిల్లీలో అవార్డు ప్రదానం



నల్లగొండ,నవంబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్): నల్లగొండ జిల్లాకు చెందిన ప్రముఖ సివిల్ ఇంజనీర్ గాదే బుచ్చయ్య అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. నల్లగొండ మండలం దోమలపల్లి గ్రామానికి చెందిన ఆయన 2026 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మకమైన లి'బెస్ట్ సివిల్ ఇంజనీర్ నేషనల్ అవార్డు'లికు ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అవార్డుల ఎంపిక కమిటీ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి వచ్చిన వందలాది దరఖాస్తులను పరిశీలించిన జాతీయ స్థాయి ఎంపిక కమిటీ.. సివిల్ ఇంజనీరింగ్ రంగంలో గాదే బుచ్చయ్య అందించిన విశేష సేవలు, నిర్మాణాల నాణ్యత, వృత్తిపట్ల నిబద్ధత, సామాజిక సేవలను పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసింది.ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అకాడమీ జాతీయ అధ్యక్షుడు, అవార్డు ఎంపిక కమిటీ జాతీయ చైర్మన్ నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా గాదే బుచ్చయ్యకు అవార్డు ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ తెలంగాణ రాష్ట్ర అవార్డు ఎంపిక కమిటీ సభ్యుడు బొమ్మకంటి రాజేందర్‌తో పాటు పలువురు అకాడమీ ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.ఈ నెల 15న న్యూఢిల్లీలో నిర్వహించనున్న బహుజన సాహిత్య అకాడమీ 20వ జాతీయ మహాసభలో గాదే బుచ్చయ్యకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ మహాసభకు దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు హాజరుకానున్నారు.గ్రామీణ ప్రాంతం నుంచి ఎదిగి జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపిక కావడం దోమలపల్లి గ్రామానికే కాకుండా నల్లగొండ జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. గాదే బుచ్చయ్య సాధించిన ఈ ఘనతపై గ్రామస్తులు, జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నారు.

అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల అండ

69 మంది లబ్ధిదారులకు రూ.69.08 లక్షల విలువైన చెక్కుల పంపిణీ
స్మార్ట్ రేషన్ కార్డులు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి





కల్లూరు, నవంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. కల్లూరు మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో తాసిల్దార్ బ్రహ్మేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు స్మార్ట్ రేషన్ కార్డులను ఆమె పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మొత్తం 69 మంది లబ్ధిదారులకు రూ.69,08,004 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. అలాగే అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం, పేద కుటుంబాల ఆర్థిక అభివృద్ధి, రైతుల సంక్షేమమే ధ్యేయంగా పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రైతులకు గిట్టుబాటు ధర, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తోందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోట్రూ అర్జున్‌రావు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు, సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు, పట్టణ అధ్యక్షులు షేక్ ఉస్మాన్, ఏఎంసీ మాజీ చైర్మన్ భాగం నీరజ, కాంగ్రెస్ నాయకులు కాటేపల్లి కిరణ్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, యాస నాగమణి శ్రీకాంత్, గుండ్ల పుల్లారావు, దాసరి సుధారాణి, భూక్యా రాంబాయి, సర్పంచులు కీసర నిర్మల మోహన్‌రెడ్డి, నాగమణి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆలకుంట నరసింహారావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విలీనం పేరుతో విద్యకు దూరం చేయొద్దు

- తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పేరుతో గ్రామీణ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు
- జీవోలను వెంటనే రద్దు చేయాలి.. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
- స్వేరోస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోండ్రు రామచంద్రు, సోంపాంగు శ్యాం సుందర్



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) : పల్లె బడే పేదింటి బిడ్డకు తొలి దేవాలయం.. ఊరి బడే నిరుపేద కుటుంబాల ఆశలకు తొలి మెట్టుగా నిలుస్తోంది. అలాంటి గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల ఉనికినే ప్రశ్నార్థకం చేసే విధంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పేరుతో ప్రభుత్వం తీసుకువస్తున్న పాఠశాలల సమీకరణ విధానం పేద విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తోందని, విద్యా ప్రమాణాలను పెంచాలనే లక్ష్యాన్ని ఎవరూ వ్యతిరేకించకపోయినా, ఆ పేరుతో గ్రామాల్లోని పాఠశాలలను మూసివేసి, చిన్నారులను దూర ప్రాంతాలకు పంపించే విధానాన్ని విరమించుకోవాలని స్వేరోస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోండ్రు రామచంద్రు, సోంపాంగు శ్యాం సుందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో స్వేరోస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోండ్రు రామచంద్రు, సోంపాంగు శ్యాం సుందర్ లు మాట్లాడుతూ... చిన్నచిన్న ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేసి ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే సమీకృత ప్రాంగణంలో విద్యాబోధన అందించాలనే ప్రతిపాదన అమలైతే గ్రామీణ ప్రాంతాల్లోని ఎంపీపీఎస్, జడ్పీహెచ్ఎస్, మోడల్ స్కూల్స్, కేజీబీవీ తదితర పాఠశాలల ఉనికికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తండాలు, గూడేలు, మారుమూల గ్రామాల్లో నివసించే పేద కుటుంబాల చిన్నారులు తమ ఊరిలోనే చదువుకునే అవకాశాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చని పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులు, ప్రాథమిక తరగతుల విద్యార్థులు ప్రతిరోజూ ఐదు నుంచి పది కిలోమీటర్ల దూరం ప్రయాణించి పాఠశాలలకు వెళ్లాల్సి వస్తే వారి పరిస్థితి ఏమిటి? రవాణా సదుపాయాలు సక్రమంగా లేకపోతే, బస్సులు సమయానికి అందుబాటులో లేకపోతే ఆ చిన్నారుల చదువు ప్రశ్నార్థకంగా మారదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల లేకపోతే పిల్లలను దూర ప్రాంతాలకు పంపలేని పేద తల్లిదండ్రులు అప్పులు చేసి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించాల్సిన దుస్థితి ఏర్పడవచ్చన్నారు. ప్రభుత్వం ఇచ్చే హామీలకు చేసే పనులకు పొంతన లేకుండా పోతుందని విమర్శించారు.గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి రావడం వల్ల రవాణా, భద్రత, కుటుంబ ఆర్థిక పరిస్థితులు వారి విద్యకు అడ్డంకులుగా మారే అవకాశముంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలే విద్యకు ప్రధాన ఆధారం. అలాంటి పాఠశాలలను దూర ప్రాంతాలకు తరలిస్తే సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్య మరింత దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.సాంఘిక సంక్షేమ గురుకులాలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు ప్రత్యేక సామాజిక లక్ష్యాలతో ఏర్పాటయ్యాయి. పేద, అణగారిన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం, ప్రత్యేక పర్యవేక్షణ అందిస్తున్నాయని వాటిని అలాగే కొనసాగించాలని కోరారు.గతంలో గురుకుల విద్యా వ్యవస్థలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వంటి అధికారులు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ, పర్యవేక్షణ, నాణ్యమైన బోధన కారణంగా వందలాది మంది విద్యార్థులు డాక్టర్లు, ఇంజినీర్లుగా ఎదిగారని గుర్తుచేస్తున్నారు. అదే తరహాలో ప్రస్తుతం ఉన్న గురుకులాలకు సబ్జెక్టుల వారీగా అర్హత కలిగిన అధ్యాపకులు, అవసరమైన సిబ్బంది, మెరుగైన వసతులు కల్పిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సూచిస్తున్నారు.రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించడం, భూముల సేకరణ, భవనాల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనకు దీర్ఘకాలం పట్టే అవకాశం ఉందని విమర్శకులు అభిప్రాయపడుతున్నారన్నారు. కొత్త భవనాల నిర్మాణం పేరుతో కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చే విధానాల కంటే, ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికే ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమించాలి. సరిపడా బోధనేతర సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, డిజిటల్ బోధన, ప్రయోగశాలలు, ఆటస్థలాలు వంటి కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలి. పాఠశాలల నిర్వహణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, అధికారుల నిరంతర పర్యవేక్షణలో నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని కోరారు.రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, విద్యాశాఖలో అధికారుల మధ్య సమన్వయం పెంచి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పేరుతో గ్రామీణ విద్యా వ్యవస్థను కేంద్రీకరించే విధానాన్ని పునఃపరిశీలించి, సంబంధిత జీవోను రద్దు చేయాలని కోరారు.ప్రభుత్వం ఈ డిమాండ్లపై సానుకూలంగా స్పందించకపోతే ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, స్వేరోస్, ఇతర ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేసి పేద విద్యార్థుల విద్యాహక్కులను కాపాడుకుంటామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో చాపలమడుగు వీరబాబు స్వేరో పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు బొక్కా వెంకటేశ్వరరావు మృతి

● భౌతికకాయానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య





కల్లూరు, నవంబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్) : కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మండల అధ్యక్షుడు, బీఆర్ఎస్ మండల నాయకుడు బొక్కా వెంకటేశ్వరరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య చంద్రుపట్లలోని ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా చంద్రుపట్ల గ్రామానికి చెందిన అల్లనేని వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందగా, ఆయన నివాసానికి వెళ్లిన సండ్ర వెంకట వీరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారుడు సురేష్‌తో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు కట్టా అజయ్ కుమార్, ఎఐసిసి రాష్ట్ర అధ్యక్షులు దైవజనులు ఏనోష్ కుమార్, గ్రామ సర్పంచ్ కాటంనేని రమాదేవి వెంకటేశ్వరావు, మాజీ సర్పంచ్ గొల్లమందల ప్రసాద్, కల్లూరు మున్సిపల్ కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు జక్కంపూడి కిషోర్, కొరకొప్పు ప్రసాద్, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఖమ్మంపాటి పుల్లారావు, వల్లభనేని శ్రీనివాసరావు, వల్లభనేని రవి, దొడ్డపనేని రవి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చాట్ల సునీల్, పరిగడుపు రాము, నల్లగట్ల కోటేశ్వరరావు, నల్లగట్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

సొంత పార్టీ ఎంపీ సభకు వెళ్తే సస్పెండ్ చేస్తారా?

● ఏకపక్ష సస్పెన్షన్‌ను వెంటనే రద్దు చేయాలి
● కొయ్యూరు గ్రామ ఉప సర్పంచ్ లకవత్ సవేందర్



పెద్దపల్లి, నవంబర్ 12 (పిసిడబ్ల్యూన్యూస్): తమపై పార్టీ విధించిన సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మలహార్ రావు మండలం కొయ్యూరు గ్రామ ఉపసర్పంచ్ లకవత్ సవేందర్,మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఎండీ ఖలీముద్దీన్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కమాన్ రోడ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉపసర్పంచ్ లకవత్ సవేందర్ మాట్లాడుతూ ఇటీవల పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ కొయ్యూరు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి నాలుగో వార్డు సభ్యురాలు లక్ష్మి, ఆమె భర్త తిరుపతి ఆహ్వానం మేరకు తాము హాజరైనట్లు తెలిపారు.అయితే,అదే రోజు సాయంత్రం మండల అధ్యక్షుడు జంగిలి శ్రీనివాస్ తమను పార్టీ నుండి బహిష్కరిస్తున్నట్లు పత్రికా ప్రకటన విడుదల చేయడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ఈ విషయంపై మండల అధ్యక్షుడిని ప్రశ్నించగా మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకే సస్పెండ్ చేశామని చెప్పారని వారు పేర్కొన్నారు. కనీసం సంజాయిషీ నోటీసు ఇవ్వకుండా,ఎవరు ఫిర్యాదు చేశారో ఆ కాపీని కూడా చూపించకుండా ఏకపక్షంగా బహిష్కరించడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల సర్పంచులు,గ్రామ అధ్యక్షులు పెద్ద ఎత్తున హాజరైనప్పటికీ వారిని వదిలేసి కేవలం తమనే లక్ష్యంగా చేసుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.ఇప్పటికే ఈ వ్యవహారంపై హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు వెళ్లి టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార రావుకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. మండల అధ్యక్షుడు జంగిలి శ్రీనివాస్ తక్షణమే తమ సస్పెన్షన్‌ను వెనక్కి తీసుకోకపోతే,ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి పార్టీ కోసం తాము చేసిన కృషిని వివరిస్తామని వారు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో వారి వెంట మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి భూమయ్య పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థిని చదువుకు ఆర్‌పీఎఫ్ అండ

- 985 మార్కులు సాధించిన గౌతమికి రూ.12,500 ఆర్థిక సాయం



ఖమ్మం, నవంబర్ 12 (పీసీడబ్ల్యూన్యూస్): తల్లిదండ్రులను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతిభావంతురాలైన విద్యార్థిని చేబ్రోలు గౌతమికి రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) అండగా నిలిచింది. ఖమ్మం ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బుర్ర సురేష్ గౌడ్ తన సిబ్బందితో కలిసి ఆమెకు రూ.12,500 ఆర్థిక సాయం అందజేశారు.ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతల గ్రామానికి చెందిన గౌతమి ఇంటర్మీడియట్ పరీక్షల్లో 1000 మార్కులకు 985 మార్కులు సాధించింది. ఆమె ప్రతిభను గుర్తించిన ఇన్‌స్పెక్టర్, సిబ్బంది ఘనంగా సన్మానించి ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా సురేష్ గౌడ్ మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో గౌతమి చదువు ఆగిపోకూడదని, ఉన్నత విద్య కొనసాగించేందుకు భవిష్యత్తులోనూ అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి. అనూష, ఏఎస్ఐలు మోదీన్ షా, రాంబాబు, సలాం, కొండల్ రావు, పంది రాజు గౌడ్ తదితర ఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి

- టిఆర్ఎస్(డి) రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ
- నిరుద్యోగుల గొంతుకగా నిలుస్తా..:బూసిరెడ్డి శంకర్ రెడ్డి



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) : తెలంగాణ రక్షణ సమితి(డెమోక్రటిక్) నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి పోటీ చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బూసిరెడ్డి శంకర్ రెడ్డి తెలుగు రాష్ట్రాల రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ గవర్నర్‌గా విశిష్ట సేవలందించారని తెలిపారు. కరోనా సమయంలో వేలాది మందికి రెండు నెలలపాటు నిరంతర అన్నదానం, ఆర్థిక సాయం చేసిన మానవతావాది అని పేర్కొన్నారు. ఎంఎల్‌సి అంటే పదవి కాదు, బాధ్యతగా తమ పార్టీ భావిస్తోందన్నారు. ఎంఎల్‌సి అభ్యర్థి బూసిరెడ్డి శంకర్ రెడ్డి మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే నిరుద్యోగుల గొంతుకగా పనిచేస్తానన్నారు. ఉద్యోగుల హక్కులకోసం నిరంతరం పోరాడతామన్నారు. గ్రాడ్యుయేట్ల కోసం ప్రత్యేక కార్యాలయాలు, ప్రతి నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ల ప్రతినిధులకమిటీ, ప్రతి హామీ అవులుపై గ్రాడ్యుయేట్లకు నివేదిక అందిస్తామని అన్నారు. ఉద్యోగం, ఉపాధి, విద్య, ఆర్థికభరోసా తమ పార్టీ ధ్యేయమని పేర్కొన్నారు. తనను గెలిపించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో నాయుకులు సాధు శంకర్, కొంపెల్లి ప్రదీప్ కుమార్, సాయం పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఎన్నికల సన్నాహక సమావేశం

- గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి. మహేందర్ పటేల్




హైదరాబాద్, నవంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ మున్నూరు కాపు సంఘం (పటేల్స్) ఆధ్వర్యంలో శుక్రవారం (13-11-2026) రాష్ట్ర ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి. మహేందర్ పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మున్నూరు కాపు సంఘం (పటేల్స్) వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మున్నూరుకాపు కుల బాంధవులు, సంఘం నాయకులు, కార్యకర్తలు, మిత్రులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని మహేందర్ పటేల్ విజ్ఞప్తి చేశారు.

ఈద్గాహ్ అభివృద్ధికి మజ్లిస్ వ్యతిరేకం కాదు

- అందరితో సంప్రదించిన తర్వాతే పనులు చేపట్టాలి: ఏఐఎంఐఎం





కరీంనగర్, నవంబర్ 12 (పి.సి.డబ్ల్యూ న్యూస్): కరీంనగర్ కళాభారతి వద్ద ఉన్న ఈద్గాహ్ సుందరీకరణ, అభివృద్ధి పనులకు మజ్లిస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని ఏఐఎంఐఎం కరీంనగర్ టౌన్ ప్రెసిడెంట్ తెలిపారు. అయితే పనులు ప్రారంభించే ముందు ఉలమాలు, ఈద్గాహ్ కమిటీ, ముస్లిం పెద్దలు, పార్టీ నాయకులతో సంప్రదింపులు జరపాలని సూచించారు. ఈద్గాహ్ పవిత్ర స్థలమని, దాని పరిరక్షణకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఈద్గాహ్ స్థలానికి ఎలాంటి నష్టం కలగకుండా మజ్లిస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

నేలవాలిన వరి.. మొలకెత్తిన రైతన్న ఆశలు

అకాల వర్షాలతో అన్నదాతకు తీరని నష్టం

పెట్టుబడి కూడా దక్కని దుస్థితి

పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఏఈఓ వెంకటేష్

నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలి ఎకరాకు తగిన పరిహారం అందించాలని రైతుల విజ్ఞప్తి

కల్లూరు, నవంబర్ (పిసిడబ్ల్యూ న్యూస్) : ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో అన్నదాత ఆశలు నేలమట్టమయ్యాయి. అకాల వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నేలవాలి, నీటిలో నానిపోయి మొలకెత్తుతోంది. దీంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అప్పులు చేసి పెట్టిన పెట్టుబడి సైతం తిరిగి వచ్చే పరిస్థితి లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో కల్లూరు మండలంలోని చిన్న కోరుకొండి, వెన్నవల్లి, తెలగవరం, తాళ్లూరు గ్రామాల్లో ఏఈఓ వెంకటేష్ గురువారం పర్యటించి పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్వయంగా పొలాల్లోకి వెళ్లి నేలవాలిన వరి పంటను, నీటిలో తడిసి దెబ్బతిన్న కంకులను పరిశీలించి నష్ట వివరాలను నమోదు చేసుకున్నారు. **కళ్లముందే మొలకెత్తిన పంట.. రైతు కన్నీటి పర్యంతం** వెన్నవల్లి గ్రామానికి చెందిన రైతు కావేటి రాధాకృష్ణమూర్తి సాగు చేసిన వరి పంట పూర్తిగా నేలవాలింది. పొలంలో నీరు నిలవడంతో నేలపై పడిన వరి కంకులకు మొలకలు వచ్చాయి. పంటను కాపాడుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసినా ప్రకృతి ప్రకోపం ముందు అవి ఫలించలేదు. కోతకు సిద్ధమైన పంట కళ్లముందే మొలకెత్తి పనికిరాకుండా పోవడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పంట కోసం చేసిన అప్పులు, పెట్టిన పెట్టుబడి ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. **రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే!** ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని బాధితులు కోరుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనకే పరిమితం కాకుండా, నష్ట వివరాలతో సమగ్ర నివేదికను వెంటనే ప్రభుత్వానికి పంపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి, ఎకరాకు తగిన పరిహారం అందించాలని కోరుతున్నారు. ఏళ్ల తరబడి కష్టపడి సాగు చేసిన పంటను ప్రకృతి దెబ్బతీయడంతో రైతన్నల కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకునే పరిస్థితి నెలకొంది. రైతుల కన్నీటిని తుడిచి, తదుపరి సాగుకు భరోసా కల్పించేలా ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపరిహారం అందించాలని ఆయా గ్రామాల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.





భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి

సర్వే సమయంలో భూముల హద్దులు సరిచూసుకోవాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష

చామనపల్లి ముంపు గ్రామ తరలింపు మూడు నెలల్లో పూర్తి చేయాలి

పెద్దపల్లి, నవంబర్ 12 (పీసీడబ్ల్యూన్యూస్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేకు రైతులందరూ పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండి తమ భూముల హద్దులను పరిశీలించుకోవాలని సూచించారు. గురువారం ధర్మారం మండలం శాయంపేటలో భూముల రీ సర్వేను, చామనపల్లిలో సోషల్ ఎకనామిక్ సర్వేను, జూలపల్లి మండలం కాచాపూర్‌లో భూముల రీ సర్వేను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం జూలపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రీ సర్వేకు ముందు రైతులకు సమాచారం అందిస్తామని, సర్వే పూర్తయ్యాక వివరాలను గ్రామంలో ప్రకటించి అభ్యంతరాల నమోదుకు గడువు ఇస్తామని తెలిపారు. రైతులు సర్వే సమయంలో అందుబాటులో లేకపోతే భవిష్యత్తులో జియో కోఆర్డినేట్ల ఆధారంగా జారీ చేసే పట్టాదారు పాస్‌పుస్తకాల విషయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. చామనపల్లి ముంపు గ్రామ తరలింపు ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సోషల్ ఎకనామిక్ సర్వేలో ప్రతి కుటుంబ వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూలపల్లి పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అల్పాహారం సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని ఉపాధ్యాయులు, అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ధర్మారం తహసీల్దార్ శ్రీనివాస్, జూలపల్లి తహసీల్దార్ దత్తు ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.







పట్టభద్రుల మద్దతే లక్ష్యంగా టీఆర్ఎస్ దూకుడు

గ్రేటర్ వరంగల్‌లో విద్యా, న్యాయ, వైద్య రంగాల ప్రముఖులతో సమావేశాలు

నడిపెల్లి వెంకటేశ్వర్ రావు, ఇస్మాయిల్ నేతృత్వంలో ప్రచారం

హనుమకొండ,నవంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్): వరంగల్ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన ప్రచారాన్ని ముమ్మరం చేసింది. పార్టీ అభ్యర్థి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌కు పట్టభద్రుల మద్దతు కూడగట్టేందుకు గ్రేటర్ వరంగల్ పరిధిలోని విద్యాసంస్థలు, న్యాయస్థానాలు, వైద్య, వ్యాపార రంగాల ప్రముఖులను కలిసి నాయకులు ప్రచారం నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులతో కలిసి ప్రచార కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. పట్టభద్రుల ఎన్నికల ఇన్‌చార్జి సయ్యద్ ఇస్మాయిల్ వివిధ జిల్లాల నుంచి వచ్చిన నాయకులతో కలిసి ప్రచారాన్ని సమన్వయం చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో నడిపెల్లి వెంకటేశ్వర్ రావు, సయ్యద్ ఇస్మాయిల్ ఇద్దరూ పట్టభద్రులను ఉద్దేశించి ప్రసంగించారు. టిఆర్ఎస్ నేత డాక్టర్ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. పట్టభద్రుల ఓటు కేవలం ఒక అభ్యర్థి గెలుపు కోసం మాత్రమే కాకుండా, విద్యావంతుల సమస్యలకు చట్టసభలో ప్రాతినిధ్యం కల్పించేందుకు ఉపయోగపడాలని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు, పట్టభద్రుల సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే తెలంగాణ రక్షణ సేన అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత నాయకత్వాన్ని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. ఇన్‌చార్జి సయ్యద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, వివిధ జిల్లాల నాయకులు సమష్టిగా పనిచేస్తూ పట్టభద్రులను కలుస్తున్నారని తెలిపారు. విద్యావంతుల ఓటు విలువను వివరించడంతో పాటు అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రచారంలో అన్ని వర్గాల పట్టభద్రులను భాగస్వాములను చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్, ఎన్నికల ఇన్‌చార్జి సయ్యద్ ఇస్మాయిల్, పార్టీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించి ఎన్నికల ప్రచార అంశాలను వివరించారు. అనంతరం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, పింగళి మహిళా కళాశాల, సిటీ మహిళా కళాశాల, వైబ్రంట్ అకాడమీతో పాటు ఇతర విద్యాసంస్థలను సందర్శించారు. హనుమకొండ, వరంగల్ జిల్లా కోర్టుల్లోని న్యాయవాదులు, సిబ్బందిని కలిసి మద్దతు కోరారు. విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు, ప్రముఖ వైద్యులు, వైద్యుల సంఘాల ప్రతినిధులతో సమావేశమై పార్టీ అభ్యర్థి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో పార్టీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, చిలుక ప్రవీణ్, ఆంజనేయులు, మానసరెడ్డి, రాధాకృష్ణ, రమాదేవి, శ్రీశైలం, నిశాంత్, సుతేజ్, జ్యోతిరెడ్డి, రవి, భిక్షపతి, విజయ, సుమన్, లత, రమేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



బహుజన న్యాయవాదుల ఐక్యత, సంక్షేమమే ఐఎల్‌పీఏ లక్ష్యం





● నవంబర్ 14న వరంగల్‌లో ఆరో రాష్ట్ర మహాసభ.. 600 మందికి పైగా ప్రతినిధుల హాజరు



హనుమకొండ,నవంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్): పూలే, అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో బహుజన వర్గాల అభ్యున్నతి, న్యాయవాదుల సంక్షేమం, సామాజిక న్యాయం లక్ష్యంగా పనిచేస్తున్న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) ఆరో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ నెల 14న వరంగల్‌లోని డీ కన్వెన్షన్‌లో నిర్వహించనున్న ఈ మహాసభకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 600 మందికి పైగా న్యాయవాదులు, న్యాయవిద్యార్థులు, ప్రతినిధులు హాజరుకానున్నారు. గురువారం హనుమకొండ కోర్టు ప్రాంగణంలోని అంబేద్కర్ భవన్‌లో ఐఎల్‌పీఏ నిర్వాహకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాసభల కన్వీనర్ చిల్లా రాజేంద్రప్రసాద్, కో-కన్వీనర్లు తీగల జీవన్ గౌడ్, జన్ను పద్మ మాట్లాడారు. ఈ సందర్భంగా కన్వీనర్ చిల్లా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. గత ఐదారు సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, బహుజన సమాజ అభ్యున్నతి కోసం ఐఎల్‌పీఏ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఆయా వర్గాల హక్కులు, సంక్షేమం, న్యాయవాదుల సమస్యలపై అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. బహుజన వర్గాలకు చెందిన న్యాయవాదులను మరింత సంఘటితం చేసి, సామాజిక ఉద్యమాల పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఆరో రాష్ట్ర మహాసభను నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమకాలీన అంశాలపై చర్చలు ఏర్పాటు చేశామని, న్యాయవాదులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కో-కన్వీనర్ తీగల జీవన్ గౌడ్ మాట్లాడుతూ.. 79 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో మహిళలు సాధించిన సమన్యాయం, వారి ప్రస్తుత స్థితిగతులు, సాధికారత వంటి అంశాలపై ప్రత్యేక చర్చా కార్యక్రమం ఉంటుందన్నారు. న్యాయవ్యవస్థలో న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన కొలీజియం విధానంపై కూడా చర్చిస్తామని తెలిపారు. దేశంలోని మెజారిటీ మూలవాసి బహుజన ప్రజలకు జనగణన, ముఖ్యంగా బీసీ జనగణన ద్వారా తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. నాలుగు ప్రత్యేక సెషన్లుగా నిర్వహించే ఈ మహాసభ సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య భాగస్వామ్యంపై కొత్త ఆలోచనలకు వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కో-కన్వీనర్ జన్ను పద్మ మాట్లాడుతూ.. నవంబర్ 14న వరంగల్ డీ కన్వెన్షన్‌లో జరిగే ఆరో రాష్ట్ర మహాసభకు న్యాయవాదులు, న్యాయవిద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చా రు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా జస్టిస్ తిరుమలా దేవి హాజరుకానుండగా, వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు నిర్మల గీతాంబ, ఎం.ఆర్. సునీత పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం జరిగే కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రి సీతక్క, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరవు తారని వెల్లడించారు. బహుజన న్యాయవాదుల సమైక్య అభివృద్ధి, సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభను అందరూ కలిసి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మహమ్మద్ నబీ, బండి మొగిలి ఐ ఎల్ పి ఏ వరంగల్ జిల్లా అధ్యక్షులు విలాసాగరం సురేందర్ ప్రధాన కార్యదర్శి గురుమిళ్ల రాజు, హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బిక్షపతి, చంద్రశేఖర్, జన్ను ప్రభాకర్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి పౌరుడు కృషి చేయాలి

● జాతీయ ప్రయోజనాలకే రాజకీయాల్లో ప్రథమ ప్రాధాన్యం: డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి






ఖమ్మం, నవంబర్ 12 (పీసీడబ్ల్యూన్యూస్): ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు, దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రతి పౌరుడు చైతన్యవంతమై ముందుకు రావాలని బీజేపీ జాతీయ నాయకుడు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మాజీ కో-ఇన్‌ఛార్జి డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు.గురువారం ఖమ్మంలోని ఐఎంఏ హాల్‌లో డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఓటు వేయడం మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వాల జవాబుదారీతనం, స్వేచ్ఛాయుత చర్చలు ముఖ్యమని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కంటే జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ, సామాజిక సమరసత వంటి విలువలతో సమాజంలోని చివరి వ్యక్తికి అభివృద్ధి ఫలాలు అందాలని పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతీయ విభేదాలకు అతీతంగా దేశ ఐక్యతను కాపాడుకోవాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలపై ప్రజలకు అవగాహన ఉండాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతిపక్షాలు, స్వతంత్ర మీడియా, న్యాయవ్యవస్థ పాత్ర కీలకమని వివరించారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ ఖమ్మం అధ్యక్షుడు డాక్టర్ కురపాటి హరిప్రసాద్, బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ నివాసానికి కేంద్ర మంత్రి బండి సంజయ్

- లక్ష్మణ్ మాతృమూర్తి లస్మవ్వకు నివాళి అర్పించిన కేంద్ర మంత్రి



హన్మకొండ నవంబర్ 12(పిసి డబ్ల్యూ న్యూస్): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం హన్మకొండ లోని ఈనాడు సీనియర్ జర్నలిస్ట్ కొండా లక్ష్మణ్ నివాసానికి వెళ్లారు. కొండా లక్ష్మణ్ మాతృమూర్తి కొండా లక్ష్మీ(లస్మవ్వ) ఈనెల 10న మరణించారు. ఈ నేపథ్యంలో లస్మవ్వ చిత్రపటానికి కేంద్ర మంత్రి నివాళి అర్పించారు. కొండా లక్ష్మణ్ ను పరామర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు స్థానిక బీజేపీ నేతలు పెద్ద ఎత్తున తరలి వచ్చి కొండా లక్ష్మణ్ ను పరామర్శించారు.

పట్టభద్రుల పక్షాన మండలిలో గళమెత్తుతా..



● నిరుద్యోగుల భవిష్యత్తుకు భరోసానిస్తా.. ఎమ్మెల్సీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్ ● తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు, బహుజనుల రాజకీయ ప్రాతినిధ్య సాధనకు యువ నాయకత్వాన్ని బలపరచాలి ● పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇన్చార్జి ఇస్మాయిల్, వరంగల్ గ్రేటర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు



హనుమకొండ,నవంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్): పట్టభద్రుల హక్కుల పరిరక్షణ, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల సాధన, విద్యావంతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే తన రాజకీయ ప్రస్థానంలో ప్రథమ ప్రాధాన్యమని తెలంగాణ రక్షణ సేన వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్ వెల్లడించారు. పట్టభద్రుల గొంతుకగా శాసనమండలిలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేందుకు తనకు ఒక్క అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న తనకు నిరుద్యోగ యువత, విద్యావంతులు ఎదుర్కొంటున్న కష్టాలు, సమస్యలపై క్షేత్రస్థాయి అవగాహన ఉందని శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించి పీహెచ్‌డీ సాధించే క్రమంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నానని, పేదరికం నుంచి వచ్చిన వ్యక్తిగా సామాన్య కుటుంబాల విద్యార్థుల ఇబ్బందులు తనకు తెలుసని పేర్కొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ అశోక్‌నగర్‌లో ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకోగలనని, వారి ఆశయాల సాధనకు తనవంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం, బహుజనులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం తన లక్ష్యాల్లో భాగమని స్పష్టం చేశారు. గతంలో పట్టభద్రుల మద్దతుతో ఎన్నికైన కొందరు ప్రజాప్రతినిధులు వారి సమస్యలను విస్మరించి పాలక పక్షాలకు అనుకూలంగా వ్యవహరించారని విమర్శించారు. అలాంటి పరిస్థితులకు భిన్నంగా ప్రజల పక్షాన నిలబడి, పట్టభద్రుల హక్కులు, నిరుద్యోగుల భవిష్యత్తు కోసం శాసనమండలిలో గట్టిగా పోరాడతానని తెలిపారు. **యువ నాయకత్వానికి పట్టభద్రులు అండగా నిలవాలి: టిఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు** తెలంగాణ రక్షణ సేన వరంగల్‌హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ నేపథ్యం, ఉన్నత విద్యార్హతలు, పట్టభద్రుల సమస్యలపై స్పష్టమైన అవగాహన కలిగిన నలమాస శ్రీకాంత్ గౌడ్‌కు పట్టభద్రులు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. బహుజన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు నిరుద్యోగ యువత సమస్యలపై నిరంతరం పోరాడే నాయకత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధనకు, విద్యావంతుల హక్కుల పరిరక్షణకు యువ నాయకుడైన శ్రీకాంత్ గౌడ్‌ను గెలిపించుకోవాలని పట్టభద్రులను కోరారు. **బహుజన బిడ్డకు అవకాశం కల్పించిన కవిత: పట్టభద్రుల ఇన్చార్జి ఇస్మాయిల్** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి ఇస్మాయిల్ మాట్లాడుతూ.. తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బహుజన వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ మహబూబాబాద్ ప్రాంతానికి చెందిన బీసీ బిడ్డ నలమాస శ్రీకాంత్ గౌడ్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించారని తెలిపారు. బహుజనులకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం దక్కాలంటే విద్యావంతులు ఐక్యంగా నిలవాలని, శ్రీకాంత్ గౌడ్‌ను గెలిపించడం ద్వారా తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధనకు, సామాజిక న్యాయానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రక్షణ సేన వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి వీర బిక్షపతి, జిల్లా కార్యదర్శి మాడుల రాజిరెడ్డి, జిల్లా నాయకులు శ్రీశైలం, సుమన్, సుతేజ్ రవి, రాధాకృష్ణ, రమాదేవి, రవికుమార్, సోల్తి కిషోర్, నిశాంత్ రావు, చిలుక ప్రవీణ్ తదితరులు, విద్యార్థి నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

శిశు మందిర్‌లో విభాగ్ స్థాయి సమావేశాలు నిర్వహణ







కరీంనగర్, నవంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో విభాగ్ స్థాయి సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశాలకు దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకర్ రెడ్డి పాల్గొని, సమావేశంలో విద్యా సంబంధిత అంశాలు, విద్యార్థుల సమగ్ర వికాసం, ఆచార్యుల బాధ్యతలు, పాఠశాలల అభివృద్ధి తదితర విషయాలపై విలువైన మార్గదర్శనం చేశారు.కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సజయ్ సమావేశంలో పాల్గొన్న విద్యావేత్తలతో చర్చించి విలువైన సూచనలు చేశారు. విద్యార్థుల్లో విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, దేశభక్తి వంటి సద్గుణాలను పెంపొందించడంలో శిశు మందిర్ విద్యావిధానం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముక్కాల సీతారామలు, పాక సత్యనారాయణ, నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, తేళ్ల రాజమౌళి, ఎలగందుల సత్యనారాయణ, బండారి కరుణాకర్, సాంబ శివరావు, కాటం రవీందర్ మరియు వివిధ పాఠశాలల ప్రతినిధులు, ఆచార్యులు, కార్యకర్తలు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోర రణధీర్ తెలిపారు.



ఘనంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు

- టీఎస్ మీసా ఆధ్వర్యంలో 85 మందికి అవార్డుల ప్రదానం



కరీంనగర్, నవంబర్ 12 (పీసీడబ్ల్యూన్యూస్): టీఎస్ మీసా కరీంనగర్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరీంనగర్‌లోని ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉమర్ అలీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యారంగ ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.ముఖ్య అతిథులుగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వై. తిరుపతిరావు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ జలాలుద్దీన్ అక్బర్, విద్యావేత్త డాక్టర్ మహమ్మద్ ఫసీహుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. విద్యతో పాటు నైతిక విలువలు అలవర్చుకోవాలని, ఆయన జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని ఒక్కరోజుకే పరిమితం చేయకుండా నిరంతరం విద్యా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. **85 మందికి అవార్డులు**కార్యక్రమంలో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, ఉత్తమ ఉపాధ్యాయ, ఉత్తమ సేవా పురస్కారాలతో పాటు వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొత్తం 85 అవార్డులు అందజేశారు. కరీంనగర్‌లోని సుమారు 30 పాఠశాలల విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొనగా, విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందించారు. టీఎస్ మీసా రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ జమీల్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సామి తదితరులు పాల్గొన్నారు. సుమారు 300 మంది హాజరయ్యారు. చివరగా హాఫిజ్ మహమ్మద్ ముతహర్ ఉద్దీన్ వందన సమర్పణ చేశారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా

కర్ర సత్యప్రసన్నారెడ్డి

● మూడోసారి బాధ్యతలు.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తా...



కరీంనగర్, నవంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్:
కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కర్ర సత్యప్రసన్నారెడ్డి మూడోసారి నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా సత్యప్రసన్నారెడ్డి మాట్లాడుతూ.. 2002లో యూత్ కాంగ్రెస్ సభ్యురాలిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించానని తెలిపారు. 2013లో ఎంపీటీసీగా విజయం సాధించి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా, రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షురాలిగా పనిచేశానన్నారు. 2019లో గోపాల్‌రావుపేట సర్పంచ్‌గా భారీ మెజారిటీతో గెలిచి ప్రజలకు సేవ చేసినందుకు కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు.2021 నుంచి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నానని, మూడోసారి అవకాశం కల్పించినందుకు మరింత బాధ్యతతో పనిచేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాద బాధిత కుటుంబానికి

అండగా ఏకశిల చైర్మన్



హనుమకొండ,నవంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్): ప్రమాద బాధిత కుటుంబానికి ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ అండ రూ.25,000 ఆర్థిక సహాయంచేసి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. పెద్ద కుమార్తె చదువుల పూర్తి బాధ్యత స్వీకరణనాగారం గ్రామానికి చెందిన మాచర్ల బిక్షపతి (40) ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న ఏకశిలా విద్యాసంస్థల వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతి రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు.ప్రమాదం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న చైర్మన్ తక్షణ సహాయంగా రూ.25,000/- (ఇరవై ఐదు వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందించారు. అంతేకాకుండా, ఆ కుటుంబంలోని పెద్ద కుమార్తె చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా, ఆమె విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు అయ్యే ఖర్చులన్నింటినీ తానే భరిస్తానని భరోసా ఇచ్చారు.కష్టాల్లో ఉన్న ఒక కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, ఆ కుటుంబంలోని చిన్నారి భవిష్యత్తుకు విద్య ద్వారా భరోసా కల్పించడం ఎంతో గొప్ప విషయం. ఆపద సమయంలో ఆ కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు, పిల్లల చదువు మధ్యలో ఆగిపోకుండా చూడాలనే చైర్మన్ గారి నిర్ణయం విద్య పట్ల, సమాజం పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనం.ఆర్థిక సహాయం ఒక కుటుంబానికి తాత్కాలిక ఉపశమనం కలిగిస్తుంది. కానీ ఒక చిన్నారి చదువు బాధ్యత తీసుకోవడం ఆమె జీవితానికి, భవిష్యత్తుకు గొప్ప భరోసా కల్పిస్తుంది. ఈ ఉదాత్తమైన ఆలోచనతో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన డాక్టర్ గౌరు తిరుపతి రెడ్డి సహృదయతను గ్రామస్థులు, స్థానికులు అభినందించారు.సమాజంలో ఆపదలో ఉన్నవారికి తోడుగా నిలవడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క చిన్నారి విద్యకు దూరం కాకుండా సహకరించడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం.ఈ కార్యక్రమంలో ఏకశిలా విద్యాసంస్థల డైరెక్టర్ సువిజ రెడ్డి, నాగారం మాజీ సర్పంచ్ చింతల పాండురంగం, పి. సాంబయ్యతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

పరకాలలో ఎమ్మెల్సీ ఓటు హెల్ప్ డెస్క్ ఏర్పాటు

● ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన.. ఓటర్లకు సహకారం



పరకాల, నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్): పరకాల నియోజకవర్గంలోని పరకాల పట్టణంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ బొచ్చు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలనుకునే వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించారు.ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్య ప్రక్రియలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జలుగురి రమేష్, మంద నరేష్, బొచ్చు రాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతురాలైన నిరుపేద విద్యార్థినికి ఆర్థిక భరోసా

- మానవత్వానికి మారుపేరుగా నిలిచిన ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

- 985 మార్కులతో ప్రతిభ కనబర్చిన చేబ్రోలు గౌతమికి రూ.12,500 ఆర్థిక చేయూత

- గౌతమి చదువుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి


- పేదరికం గౌతమి ఉన్నత విద్యకు ఆటంకం కాకూడదు



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) : కన్నవారి ప్రేమానురాగాలు, ఆప్యాయతలు దూరమైనా.. కష్టాలను ఎదురొడ్డి చదువునే తన జీవిత లక్ష్యంగా మలుచుకున్న ప్రతిభావంతురాలు చేబ్రోలు గౌతమి. కష్టాల కొలిమిలో ఆత్మవిశ్వాసంతో విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూ ఇంటర్మీడియట్‌లో 1000 మార్కులకు గాను 985 మార్కులు సాధించి అసాధారణ ప్రతిభను చాటుకుంది. ఇలాంటి సమయంలో మానవత్వంతో స్పందించిన ఖమ్మం రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) ఇన్‌స్పెక్టర్ బుర్ర సురేష్ గౌడ్, ఆయన సిబ్బంది గురువారం గౌతమికి ఆర్థిక చేయూతనందించి ఆదర్శంగా నిలిచారు.ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతల గ్రామానికి చెందిన గౌతమి విద్యాభ్యాసం, వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఇన్‌స్పెక్టర్ బుర్ర సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ అధికారులు, సిబ్బంది సమష్టిగా రూ.12,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా 985 మార్కులతో ప్రతిభ కనబరిచిన గౌతమిని ఘనంగా సన్మానించి అభినందించారు. కేవలం ఆర్థిక సహాయం అందించడమే కాకుండా.. ఆమె విద్యాభవిష్యత్తుకు భరోసా కల్పించడం ప్రత్యేకతగా నిలిచింది.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ బుర్ర సురేష్ గౌడ్ మాట్లాడుతూ.. గౌతమి చదువును నిరంతరాయంగా కొనసాగించేందుకు భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఉన్నత విద్యను అభ్యసించే క్రమంలో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు, ఆటంకాలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ఆర్‌పీఎఫ్ సిబ్బంది తరఫున తమ వంతు సహాయం అందిస్తామని భరోసా కల్పించారు.ప్రతిభావంతురాలైన నిరుపేద విద్యార్థిని ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. ఆమె కలలు మధ్యలోనే ఆగిపోకుండా ఉండాలంటే సమాజంలోని దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, సేవాభావం కలిగిన వ్యక్తులు, విద్యా సహాయానికి ముందుకొచ్చే సంస్థలు మానవతా దృక్పథంతో స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.ఒక్కరి చేయూత ఒక విద్యార్థిని జీవితాన్నే మార్చగలదు. గౌతమి ఉన్నత విద్యకు అవసరమైన ఆర్థిక సహాయం, విద్యా ఖర్చులు, ఇతర అవసరాలను గుర్తించి దాతలు ముందుకు వస్తే ఆమె భవిష్యత్తుకు గొప్ప భరోసా లభిస్తుంది. ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ తమకు తోచినంత సహాయం అందించాలని, గౌతమి చదువు పూర్తయ్యే వరకు అండగా నిలవాలని మానవతావాదులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ బుర్ర సురేష్ గౌడ్, ఎస్ఐ పి. అనూష, ఏఎస్ఐ మోదీన్ షా, ఏఎస్ఐ రాంబాబు, ఏఎస్ఐ సలాం, కొండల్ రావు, పంది రాజు గౌడ్ తదితర ఆర్‌పీఎఫ్ సిబ్బందిని పలువురు అభినందిస్తున్నారు. విధి నిర్వహణతో పాటు సామాజిక బాధ్యతను గుర్తించి ఓ నిరుపేద విద్యార్థిని భవిష్యత్తుకు అండగా నిలవడం అభినందనీయమని ప్రశంసిస్తున్నారు.

నాగులచవితి పర్వదినం ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నింపాలి!

- తెలుగు రాష్ట్రాల ప్రజలకు నాగులచవితి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు చుండూరు రాజరాజేశ్వరి, పాలడుగు కృష్ణ ప్రసాద్





ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 12 (పి.సి.డబ్ల్యూ న్యూస్): నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ తెలుగు మహిళ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి చుండూరు రాజరాజేశ్వరి, ఖమ్మం జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పాలడుగు కృష్ణ ప్రసాద్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ పవిత్రమైన పండుగ సందర్భంగా ప్రతి ఇంటా ఆనందం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే నాగులచవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ప్రకృతి పట్ల గౌరవం, జీవరాశుల పట్ల కరుణ, భక్తిభావం ప్రతి ఒక్కరిలో పెంపొందాలని పేర్కొన్నారు.నాగదేవతల ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని, రైతులు, వ్యాపారులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ ప్రజలందరి జీవితాల్లో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని కోరుకుంటూ మరోసారి నాగులచవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడికి మెరుగైన వైద్యం అందించాలి

- వైద్యులను ఆదేశించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, నవంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) : అన్నమయ్య జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మవరం శాంతినగర్‌కు చెందిన మోహనకృష్ణ (23) తీవ్రంగా గాయపడటంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. మదనపల్లిలో చికిత్స పొందుతున్న యువకుడితో ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు.మంత్రి సూచన మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబులేసు, టీడీపీ నాయకుడు రాళ్లపల్లి బాబుతో కలిసి బాధితుడి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించారు. యువకుడికి మెరుగైన వైద్యం అందుతోందని, మంత్రి సత్యకుమార్ యాదవ్ అండగా ఉంటారని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.



బాలల భద్రతకు సైబర్ అవగాహనే శ్రీరామరక్ష!

- సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి.. ఆన్‌లైన్ మోసాలు, వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: కే. శ్రీనివాస్



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 12 (పి.సి.డబ్ల్యూ న్యూస్): నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు అంతర్జాలం, చరవాణి, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సురక్షితంగా, బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ అండ్ డెవలప్‌మెంట్ (ఎయిడ్) సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ కే. శ్రీనివాస్ సూచించారు. సాంకేతికత పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాలే తప్ప, వారి బాల్యానికి, భద్రతకు ముప్పుగా మారకూడదని పేర్కొన్నారు.స్థానిక జల్లేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థినీ విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలు, సైబర్ భద్రత, బాలికల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు అంతర్జాలాన్ని విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగించుకోవాలని అన్నారు. సామాజిక మాధ్యమాల ఆకర్షణకు లోనుకాకుండా వాటి వినియోగాన్ని పరిమితం చేసుకుని చదువుపై దృష్టి సారించాలని సూచించారు. అపరిచితులు సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయం పెంచుకుని వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, వీడియోలు అడిగితే స్పందించవద్దని హెచ్చరించారు. పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఎవరికీ తెలియ జేయకూడదని, ఆన్‌లైన్ వేధింపులు, అసభ్య సందేశా లు, బెదిరింపులు ఎదురైతే భయపడకుండా తల్లిదం డ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని సూచించారు. బాధిత బాలికలను నిందించకుండా వారికి అండగా నిలవాలని, వారి గౌరవం, గోప్యతను కాపాడాలని పేర్కొన్నారు. బాలికలపై లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా వంటి సమస్యల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పోక్సో చట్టం, బాల్యవివాహాల నిషేధ చట్టం, బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. బాలలు ఆపదలో ఉన్నప్పుడు లేదా వేధింపులకు గురైనప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. బాలల హక్కులు, సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, కెరీర్ మార్గదర్శకత్వం తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యతో పాటు మానవత్వం, క్రమశిక్షణ, పరస్పర గౌరవం, నైతిక విలువలు అలవర్చుకున్నప్పుడే మంచి సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని శ్రీనివాస్ పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేష్, ఎయిడ్ టీమ్ సభ్యుడు భాస్కర్, ఉపాధ్యాయులు నంద్య, నాగేశ్వరరావు, పార్థసారథి, ఉపేందర్, పుల్లయ్య, రామారావు, సైదులు, ఝాన్సీ, లక్ష్మి తదితరులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపూర్(గూడూర్) ఎంజెపి గర్ల్స్ ప్రిన్సిపల్ పై

గూడూర్ సర్పంచ్ బండి వనజ ఫైర్

- **ఫోటో కాల్ పాటించడం లేదంటూ సర్పంచ్ వనజ ఆగ్రహం**



కమలాపూర్ నవంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని(గూడూర్) ఎం జె పి బాలికల పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ ఫోటో కాల్ పాటించడం లేదంటూ స్థానిక గూడూర్ మహిళ సర్పంచ్ బండి వనజ ఫైర్ అయ్యారు.వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి మహాత్మ జ్యోతిబాపూలే బాలికలపాఠశాల కళాశాలల స్థాయి క్రీడా పోటీలు బుధవారంప్రారంభమయ్యాయి. ఈ ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ అడిషనల్ కలెక్టర్ ఎన్ రవి హాజరై క్రీడా పోటీలు ప్రారంభించారు.కమలాపూర్ తాహసిల్దార్ ఏం సురేష్ కుమార్, హనుమకొండ డిసిఓ స్టెల్లా,మాజీ ఆర్ సి ఓ మనోహర్ రెడ్డి,ఉమ్మడి జిల్లాల డిసిఒలు,18 పాఠశాలల కళాశాలల ప్రిన్స్ పాల్స్, అండర్ 14 17 19 లో దాదాపు 1700 మంది విద్యార్థులు పాల్గొన్న ఇంత పెద్ద కార్యక్రమం వరంగల్ ఉమ్మడి జిల్లాల స్థాయి క్రీడా పోటీలకు కనీసం సమాచారం ఇవ్వకుండా ఫోటో కాల్ పాటించకుండా స్థానిక గూడూర్ మహిళా సర్పంచ్ అయినటువంటి బండి వనజను ఆహ్వానించకపోవడం మండలంలో పెద్ద చర్చకు దారితీసింది.ఈ వివాదంపై గూడూర్ సర్పంచ్ బండి వనజ కమలాపూర్ ఎం జె పి ప్రిన్సిపాల్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఫోటో కాల్ వివాదం పై హనుమకొండ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు గూడూర్ సర్పంచ్ భర్త అడ్వకేట్ బండి కళాధర్ తెలిపారు.ప్రిన్సిపాల్ మహిళా సర్పంచిని అవమానపరిచి తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని కమలాపూర్ మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

రాష్ట్రస్థాయి బాలోత్సవ్ ఖమ్మం ప్రతిష్టను పెంచాయి

- **బాలోత్సవ్ కళా ప్రదర్శనలు సృజనాత్మకతను ప్రతిబింబించాయి**
- **బాలోత్సవ్‌కు అనూహ్య స్పందన రావడం నిర్వాహకుల సామర్థ్యాన్ని తెలియజేశాయి**
- **యువ నాయకుడు తుమ్మల యుగంధర్**
- **అంబరాన్నంటిన రాష్ట్రస్థాయి బాలోత్సవ్ సంబురాల పోటీలు.**







ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) : ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో గత రెండు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ సంబురాలు ఖమ్మం ప్రతిష్టను మరింతగా పెంచాయని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ యువ నాయకుడు తుమ్మల యుగంధర్ పేర్కొన్నారు. స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో బాలోత్సవ్ ముగింపు వేడుకలకు తుమ్మల యుగేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వారధి ఫౌండేషన్, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన బాలోత్సవ్ వేడుకల ముగింపు సభ గురువారం జరగగా తుమ్మల యుగేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా తుమ్మల యుగేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన బాలోత్సవ్ కు అనూహ్య స్పందన రావడం నిర్వాహకుల సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి బాలోత్సవ్ లు దోహదపడుతున్నాయని తెలిపారు. పిల్లలు మరింత చురుకుగా మానసిక, శారీరక దృఢత్వం పెంచడానికి బాలోత్సవ్ పోటీలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కళల ప్రదర్శనల ద్వారా పిల్లల్లో సహకార గుణం, క్రమశిక్షణ, పోటీ తత్వం అలవరుతుందని చెప్పారు. బాలోత్సవ్ నిర్వాహకులు వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ... విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీయడానికి ప్రతిష్టాత్మకంగా సాహసోపేతంగా ఈ రాష్ట్రస్థాయి బాలోత్సవ్ నిర్వహించామని వివరించారు. పిల్లల్లో ప్రతి ఒక్కరిలో ఏదో ఒక సృజన దాగి ఉంటుందని ఈ సృజనను పాఠశాలల ద్వారా ఉపాధ్యాయులు, గృహాల్లోని తల్లిదండ్రులు పరిశీలించి ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రస్థాయి బాలోత్సవ్ ఘనవిజయం సాధించడం తమకు మరింత సంతృప్తిని కలుగజేసిందని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి బాలోత్సవ్ లను నిర్వహించడానికి ప్రేరణ కలిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లూమింగ్ మైండ్ స్కూల్ కరస్పాండెంట్ అశోక్ రెడ్డి, డాక్టర్ రాధికా రాణి, కొల్లి కల్పన, స్మార్ట్ కిడ్జ్ స్కూల్ డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాయల్ నాగరాజు, జిల్లా నాయకులు చిక్కుళ్ళ వెంకటేష్, పగిళ్లపల్లి రాజు, ఆర్ ఎన్ ప్రసాద్, రాజేష్, భవాని శంకర్, ముఖేష్, నాని సతీష్ , సంతోషి, తదితరులు పాల్గొన్నారు. సభానంతరం సాంప్రదాయ నృత్యాలు, జానపద నృత్యాలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలలో గెలుపొందిన సీనియర్, జూనియర్ విజేతలకు అతిథులు బహుమతి ప్రధానం చేశారు. గత రెండు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ సంబురాలు గురువారం రాత్రి తో ముగిసాయి. బాలోత్సవ్ పోటీలకు అనూహ్య స్పందన రావడం నిర్వాహకుల సామర్థ్యానికి దర్పణం పట్టాయి. **అంబరాన్నంటిన రాష్ట్రస్థాయి బాలోత్సవ్ సంబురాల పోటీలు :** స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ సంబురాలు బాలల సృజనాత్మకతకు దర్పణం పట్టాయి. రెండో రోజు గురువారం సాంప్రదాయ నృత్యాలు, జానపద నృత్యాల విభాగాలలో గ్రూప్ డాన్స్ పోటీలలో విద్యార్థులు సత్తా చాటారు. ఫాన్సీ డ్రెస్ పోటీలలో చిన్నారులు ఎల్ నినో, కాలుష్యం, పర్యావరణ పరిరక్షణ అంశాలతో వస్త్రధారణతో పోటీలలో పాల్గొన్నారు. అదేవిధంగా చిన్నారులు భగత్ సింగ్, వీరనారి రాణి రుద్రమదేవి, శ్రీ వెంకటేశ్వర స్వామి, సైనికుడు, రైతు, రాకెట్, తదితర వేషధారణలతో అలరించారు. ఫాన్సీ డ్రెస్ చిన్నారులకు స్మార్ట్ కిడ్జ్ స్కూల్ డైరెక్టర్ చింత నిప్పు సుకన్య ప్రశంసా పత్రాలను అందజేశారు. జానపద గ్రూప్ డాన్స్ విభాగంలో, సాంప్రదాయ గ్రూప్ డాన్స్ విభాగంలో విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో, ప్రాపర్టీస్లతో పాటకు అనుగుణంగా లయబద్ధంగా నృత్యాలు చేస్తూ సభా ప్రాంగణాన్ని రెండో రోజు ఉర్రూతలూగించారు. తమ పిల్లలు ప్రదర్శించిన నృత్యాలను అతిపెద్ద డిజిటల్ స్క్రీన్, డిజిటల్ లైట్ల వెలుగుల్లో తిలకించి తల్లిదండ్రులు మధురానుభూతిని చెందారు. అది పెద్ద వేదికపై తమ పిల్లలు చేసిన నృత్య ప్రదర్శనలకు పేరెంట్స్ ఫిదా అయ్యారు. పోటీల్లో పాల్గొన్న పిల్లలకు, వారి తల్లిదండ్రులకు, అతిథులకు నిర్వాహకులు షడ్రుచుల విందు భోజనాన్ని అందించడంతో ప్రతి ఒక్కరూ బాలోత్సవ్ నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా నిర్వాహకుల కృషికి బాల బాలికల నుంచి అనుహ్య స్పందన రావడంతో బాలోత్సవ్ నిర్వాహకుల్లో ఆనందోత్సవాలు వెల్లి విరిసాయి. బాలోత్సవ్ సంబురాలను, బహుమతి ప్రధానోత్సవ వేడుకలను వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాయల్ నాగరాజు, జిల్లా నాయకులు చిక్కుళ్ళ వెంకటేష్, పగిళ్లపల్లి రాజు, ఆర్ ఎన్ ప్రసాద్, రాజేష్, భవాని శంకర్, ముఖేష్,సతీష్,నాని,సంతోషి పర్యవేక్షించారు.



మాదిగల సంక్షేమమే తొలితరం ఎమ్మార్పీఎస్ లక్ష్యం

- **తొలితరం ఎమ్మార్పీఎస్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లారు రత్నం**
- **తొలితరం ఎమ్మార్పీఎస్ రెండు జిల్లాల కమిటీలు ఏకగ్రీవం**





ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) : మాదిగల సంక్షేమమే తొలితరం ఎమ్మార్పీఎస్ లక్ష్యం అని తొలితరం ఎమ్మార్పీఎస్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లారు రత్నం అన్నారు. ఖమ్మంలో గురువారం తొలితరం ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గత 30 సంవత్సరాలు పైగా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో పాల్గొని, అనేక త్యాగాలు చేసిన నాయకులు సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఖమ్మం, భద్రాద్రి - కొత్తగూడెం జిల్లాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో తొలితరం ఎమ్మార్పీఎస్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లారు రత్నం హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా తొలితరం నాయకుల కమిటీ ఆవశ్యకతను వివరించారు. ఖమ్మం జిల్లా కన్వీనర్ గా కొరకొప్పు రామారావు, కో-కన్వీనర్ గా దగ్గుపాటి రమాదేవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా కన్వీనర్ గా గొడ్ల మోహన్రావు, కో-కన్వీనర్ గా కనుకుంట్ల నిర్మల లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్చార్జిగా మట్టే గురుమూర్తిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో తొలితరం ఎమ్మార్పీఎస్ సంఘం ఉపాధ్యక్షులు నకరికంటి సంజీవరావు, రాష్ట్ర కార్యదర్శి చిట్యాల సాయన్న, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పసుపుల రాజశేఖర్‌కు వైవీయూ డాక్టరేట్ ప్రదానం

- మహిళా కార్యకర్తల స్వీయ జీవిత చరిత్రలపై పరిశోధన



కడప, నవంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) : యోగి వేమన విశ్వవిద్యాలయం ఆంగ్ల శాఖ పరిశోధక విద్యార్థి పసుపుల రాజశేఖర్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు.ఆంగ్ల శాఖ ఆచార్యులు పి. పద్మ పర్యవేక్షణలో 'ఎంపిక చేసిన భారతీయ మహిళా కార్యకర్తల స్వీయ జీవిత చరిత్రలు: ఒక అధ్యయనం' అనే అంశంపై రాజశేఖర్ పరిశోధన చేశారు. పరిశోధనా గ్రంథాన్ని నిపుణుల బృందం మూల్యాంకనం చేసి, వైవా వోస్ కమిటీ సిఫార్సుల మేరకు పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ డిగ్రీకి అర్హుడిగా ప్రకటించారు.డాక్టరేట్ పొందిన రాజశేఖర్‌ను వైవీయూ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, రెక్టార్ ప్రొఫెసర్ ఏజీ దాము, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్సీ గంగిరెడ్డి, ఆంగ్ల శాఖ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్' విడుదల తేదీ ఖరారు..

సత్యతో కలిసి కామెడీ పంచేందుకు రెడీ



హాస్య నటుడు అల్లరి నరేశ్ మరోసారి ప్రేక్షకులను నవ్వించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఆల్కహాల్' డిసెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ గురువారం ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా విడుదల తేదీని వెల్లడిస్తూ పోస్టు పెట్టింది.

గతేడాది విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచింది. ఇందులో అల్లరి నరేశ్ పాత్ర మద్యానికి పూర్తిగా దూరంగా ఉండే వ్యక్తిగా కనిపిస్తుంది. టీజర్‌లో సత్య, అల్లరి నరేశ్ మధ్య జరిగే సంభాషణలు నవ్వులు పూయించాయి. లక్షలు సంపాదిస్తున్నా ఎందుకు మద్యం తాగవని సత్య ప్రశ్నించగా.. సంపాదనకు, మద్యం తాగడానికి సంబంధమేంటని నరేశ్ ఎదురు ప్రశ్నిస్తాడు.

తాను మద్యం తాగకపోవడానికి కారణం చెబుతూ.. తాగితే తన నియంత్రణలో తాను ఉండలేనని, మద్యం తనను శాసించడం ఇష్టం లేదని అంటాడు. చివర్లో సత్య మద్యం మానేశానని చెప్పగా.. తన స్నేహితులు తాగుతారని నరేశ్ బదులివ్వడం, వారు తాగకపోతే తాగించేలా చేయమని చెప్పడం టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మెహర్ తేజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అల్లరి నరేశ్‌తో పాటు రుహానీ శర్మ, నిహారిక ఎన్ఎం, సత్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. గిరీశ్ కులకర్ణి, హర్షవర్ధన్, చైతన్య కృష్ణ, రవీంద్ర విజయ్, రఘుబాబు, వెంకటేశ్ కాకుమాను, కిరీటి, హరితేజ, సూర్య భగవాన్ దాస్, ఫ్లోరా జాకబ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

సినిమాకు గిబ్రాన్ సంగీతం అందిస్తుండగా, నేపథ్య సంగీత బాధ్యతలు చైతన్ భరద్వాజ్ చేపట్టారు. జిజు సన్నీ కెమెరా, నిరంజన్ దేవరమనే ఎడిటింగ్ అందిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది.

నవ్వి‌స్తూనే ఆలోచింపజేసేలా..

'ఇడుపు కాయితం' టీజర్




విలక్షణ నటుడు ప్రియదర్శి, నూతన నటి నాగదుర్గ జంటగా నటిస్తున్న చిత్రం 'ఇడుపు కాయితం'. ప్రముఖ నిర్మాణ సంస్థలు సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్‌ను తాజాగా విడుదల చేశారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సరదా కుటుంబ కథా చిత్రంపై టీజర్ అంచనాలను పెంచుతోంది.

ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు గారి మాటలతో ప్రారంభమైన ఈ టీజర్, శ్రీను (ప్రియదర్శి), శ్రీలత (నాగదుర్గ) పాత్రల మధ్య ప్రేమ, పెళ్లి ప్రస్తావన, వివాహ వేడుకలు, కుటుంబ సభ్యుల మధ్య జరిగే హాస్యభరిత సన్నివేశాలతో సరదాగా సాగింది. అయితే, తెలంగాణ మాండలికంలో 'ఇడుపు కాయితం' అంటే విడాకుల పత్రం అని అర్థం. పెళ్లి బంధంతో మొదలైన కథ, విడాకుల వరకు ఎందుకు వెళ్లిందనే ఆసక్తిని రేకెత్తించేలా టీజర్‌ను తీర్చిదిద్దారు. సంతోషంగా సాగిపోతున్న వీరి జీవితంలో ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయనేది కథలో కీలక అంశంగా కనిపిస్తోంది.తెలంగాణ జానపద సంగీతం, నృత్యంతో ఎంతో ప్రాచుర్యం పొందిన నాగదుర్గ ఈ సినిమాతో కథానాయికగా వెండితెరకు పరిచయం అవుతుండటం విశేషం. వంశీ రెడ్డి దొండపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సురేశ్ బొబ్బిలి అందించిన సంగీతం ఇప్పటికే ప్రేక్షకులను ఆకట్టుకుంది. సినిమా నుంచి విడుదలైన 'శ్రీలత', 'గడప' పాటలతో పాటు దీపావళికి రిలీజ్ చేసిన ఎనర్జిటిక్ 'బరాత్ బీట్' పాటకు కూడా మంచి స్పందన లభించింది.

అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను డిసెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. సుకుమార్, బన్నీ వాస్ వంటి అగ్ర నిర్మాతలు అందిస్తున్న సినిమా కావడంతో 'ఇడుపు కాయితం'పై సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

ఇద్దరు పిల్లల తల్లిగా సాయిపల్లవి

ఓకే బంగారం– చిత్రంలో నిత్యా మీనన్ పాత్రను ఎంతో అద్భుతంగా చూపించిన మణిరత్నం నుంచి ఇప్పుడు మరో అద్భుతమైన రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామా కాన్సెప్ట్ సినిమాగా రూపొందుతోంది. –ఇంజి వెల్లం– టైటిల్ తో రూపొందుతున్న ఈ సినిమాలో విజయ్ సేతుపతి లాంటి జాతీయ ఉత్తమ నటుడి సరసన సాయిపల్లవి కథానాయికగా నటిస్తోంది. ఆసక్తికరంగా ఈ చిత్రంలో సాయిపల్లవి గృహిణిగా, ఇద్దరు పిల్లలకు తల్లిగా నటిస్తోంది. కోల్ కత బ్యాక్ డ్రాప్ లో రూపొందిస్తున్న ఈ చిత్రానికి మణిరత్నం లాంటి స్టార్ డైరెక్టర్ రచన, దర్శకత్వం వహిస్తుండటంతో దీనిపై చాలా చర్చ సాగుతోంది. అయితే దర్శకదిగ్గజం ఈ ట్యాలెంటెడ్ నటి పాత్రను ఎలా మలిచారో అనే చర్చ కొనసాగుతోంది.మణిరత్నం తన సినిమాల్లో నాయకానాయికల మధ్య రొమాంటిక్ కోణాన్ని అద్భుతంగా ఆవిష్కరిస్తారు. అలాంటి ఆవిష్కరణలు గతంలో ఎన్నో. ఆయన సినిమాల్లో నాయికల పాత్రలు కేవలం గ్లామర్ కోసమే ఉండవు. కథను ముందుకు నడిపించే ఆత్మలా ఉంటాయి. –ఓకే బంగారం– చిత్రంలో నిత్యా మీనన్ పాత్ర ఒక అర్బన్ ఆర్కిటెక్ట్‌గా, రిలేషన్‌షిప్‌పై స్పష్టమైన అభిప్రాయాలున్న మోడరన్ అమ్మాయిగా ఎంత సహజంగా కనిపిస్తుందో, మనసు విరిగినప్పుడు అంతే తీవ్రంగా స్పందిస్తుంది. ఇప్పుడు –ఇంజి వెల్లం–లో సాయిపల్లవి పాత్రను కూడా అదే స్థాయిలో ఎలాంటి కృత్రిమత్వం లేని సహజమైన పాత్రగా మణిరత్నం మలచినట్లు తెలుస్తోంది.ఇప్పటివరకు సాయిపల్లవి ఎక్కువగా కాలేజీ స్టూడెంట్ గా డాన్సర్ గా లేదా స్వతంత్ర భావాలున్న యువతి పాత్రల్లోనే ఎక్కువగా మెప్పించారు. అయితే అందుకు భిన్నంగా పరిణతి చెందిన గృహిణిగా నటిస్తుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇద్దరు పిల్లల తల్లిగా నటించడం సవాల్ అయినా కానీ.. దానిని నిరూపిస్తుందనే నమ్మకం ఉంది. సాయి పల్లవి నిజానికి కళ్లతోనే భావాలను అద్భుతంగా పలికించగలదు గనుక ఈ పాత్రకు ప్లస్ అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక విజయ్ సేతుపతితో పోటీపడుతూ అద్భుతమైన నటనను కనబరిచేందుకు ఆస్కారం ఉంది. ఈ ఇద్దరి ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ క్రేజీ చిత్రానికి ఎ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండటం మరో ప్రధాన ఆకర్షణ. –ఇంజి వెల్లం– ప్రపంచవ్యాప్తంగా 2027 జనవరి 29న థియేటర్లలో విడుదల కానుంది. నితీష్ తివారీ –రామాయణం–లో సీత పాత్రతో చర్చల్లో నిలిచిన సాయిపల్లవి తదుపరి మణిరత్నం సినిమాతో పాటు, అమరన్ దర్శకుడితో సినిమాలోను ఛాలెంజింగ్ పాత్రలు పోషిస్తుండటం ఆసక్తిని కలిగిస్తోంది.



అయ్యప్ప దయ వల్ల అందరం క్షేమంగా ఉన్నాం : శేఖర్ మాస్టర్

శంషాబాద్ ముచ్చింతల్ సమీపంలో శేఖర్ మాస్టర్ ప్రయాణిస్తున్న కారుకు ప్రమాదం

అతివేగంగా వచ్చిన పండ్ల లోడు లారీ కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టిన వైనం

ప్రమాద తీవ్రతకు పూర్తిగా నుజ్జునుజ్జైన కారు వెనుక భాగం



టాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ ప్రయాణిస్తున్న కారుకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ దుర్ఘటనలో ఆయనతో పాటు కారులో ఉన్న మరో ముగ్గురు ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు.మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న చిత్రం 'కాకా'లో ఒక పాటకు సంబంధించిన నైట్ షూటింగ్ ముగించుకుని, శేఖర్ మాస్టర్ తన బృందంతో కలిసి కారులో తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్ వద్దకు చేరుకోగానే... ఉదయం సుమారు 6 గంటల ప్రాంతంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన పండ్ల లోడు లారీ వీరి కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు వెనుక భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. అయితే, కారులోని శేఖర్ మాస్టర్‌తో పాటు ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.ఈ ప్రమాదంపై శేఖర్ మాస్టర్ ఒక వీడియో సందేశం ద్వారా స్పందిస్తూ... "కాకా సాంగ్ షూటింగ్ ని ముగించుకొని తిరిగి వస్తుంటే తెల్లవారుజామున 6 గంటలకు కారు యాక్సిడెంట్ కి గురైంది. కారు వెనక భాగం పూర్తిగా దెబ్బతింది. ఆ సమయంలో కారులో మేము నలుగురం ఉన్నాం.. అయ్యప్ప దయ వల్లే మాకు ఏమీ జరగలేదు. అందరూ నాకు ఏమైందో అని మెసేజ్ లు చేస్తున్నారు. నేను క్షేమంగా ఉన్నాను. మాతో పాటు ఉన్నవారు కూడా క్షేమంగా ఉన్నారు. ఈరోజు రాత్రికి కూడా షూటింగ్ ఉంది. దానికి బయల్దేరుతున్నాను" అని తెలిపారు.ఇటీవలే అయ్యప్ప స్వామి మాల ధరించిన శేఖర్ మాస్టర్.. స్వామివారి ఆశీస్సుల వల్లే ఇంతటి ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డామని భావోద్వేగంతో వెల్లడించారు. తామంతా క్షేమంగా ఉన్నామని చెప్పడంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఊపిరి పీల్చుకున్నారు.

నాని సినిమా టీంపై బాబు మోహన్ ఫైర్.. కర్మ ఫలం అంటూ సంచలన వ్యాఖ్యలు!



నాని హీరోగా నటించిన 'ది ప్యారడైజ్' సినిమా మేకర్స్‌పై సీనియర్ హాస్యనటుడు బాబు మోహన్ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ చిత్ర యూనిట్ తనను అవమానించిందని, అందుకే వారికి 'కర్మ' తగిలి సినిమా బాక్సాఫీస్ వద్ద విఫలమైందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బాబు మోహన్ ఈ విషయాలను వెల్లడించారు.సికింద్రాబాద్ నేపథ్యంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' సినిమాలో ఓ ముఖ్యమైన పాత్ర కోసం చిత్ర యూనిట్ తనను సంప్రదించిందని బాబు మోహన్ తెలిపారు. "నాకు లుక్ టెస్ట్ చేశారు. మేకప్ వేసి, పలు రకాల కాస్ట్యూమ్స్ ప్రయత్నించారు. ఈ పాత్రకు మీరే సరిగ్గా సరిపోయారని మెచ్చుకున్నారు. షూటింగ్ మొదలైనప్పుడు కచ్చితంగా పిలుస్తామని చెప్పారు. కానీ ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి సమాచారం రాలేదు" అని ఆయన వివరించారు.

సినిమా విడుదలయ్యే వరకు తాను వారి నుంచి పిలుపు కోసం ఎదురుచూశానని, అయితే ఎలాంటి స్పందన రాలేదని బాబు మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవేళ నన్ను ఆ పాత్రకు తీసుకోకపోయినా, కనీసం ఆ ఒక్క మాట చెప్పే మర్యాద పాటించాల్సింది. అది కూడా చేయకుండా అవమానించారు" అని ఆయన అన్నారు.చిత్రం బాక్సాఫీస్ వద్ద నిజాం ఏరియా మినహా మిగతా ప్రాంతాల్లో పెద్దగా ఆడలేదని, కథనం నెమ్మదిగా ఉందనే విమర్శలు వచ్చాయని బాబు మోహన్ చురకలు అంటించారు. పరిశ్రమలో తనను చాలామంది 'లక్కీ లెగ్'గా భావిస్తారని, గతంలో తాను లేని కొన్ని చిత్రాలు ఫ్లాప్ అయిన సందర్భాలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు ఈ సినిమాకు కూడా అదే జరిగిందని, వారికి కర్మ ఫలం దక్కిందని వ్యాఖ్యానించారు.శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, నాని హీరోగా వచ్చిన 'ది ప్యారడైజ్ ' చిత్రం విడుదలకు ముందు మంచి అంచనాలు రేపినప్పటికీ, ఆ తర్వాత ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. బాబు మోహన్ చేసిన ఈ వ్యాఖ్యలపై చిత్ర యూనిట్ ఇంకా స్పందించలేదు.